Namasthe Telangana DL-07/12/17



జూబ్లీహిల్స్‌లో మెట్రో పనులను పరిశీలిస్తున్న ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

# జూన్‌కల్లా హైటెక్‌సిటీకి..

- సిద్ధమవుతున్న మెట్రో కారిడార్-1, 3
- పనులను పరిశీలించిన మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మెట్రోరైలును వచ్చే ఏడాది జూన్‌నాటికి హైటెక్‌సిటీ వరకు నడుపడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు పనులను వేగవంతం చేశారు. మొదటి దశలో భాగంగా ఇప్పటికే కారిడార్-1, కారిడార్-3లను కలుపుతూ నాగోల్ నుంచి మియాపూర్ వరకు 30 కిలోమీటర్ల మార్గాన్ని ప్రారంభించిన అధికారులు.. ఈ కారిడార్లను పూర్తి చేయాలని నిర్ణయించారు. ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు 2018 జూన్‌లోగా నాగోల్ నుంచి హైటెక్‌సిటీ వరకు, ఎల్బీనగర్ నుంచి మియాపూర్ వరకు.మార్గాలను పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, అధికారులు, ఎల్ అండ్ టీ ఇంజినీర్లు జూబ్లీహిల్స్ నుంచి రాయదుర్గం వరకు కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఫుట్‌పాత్‌లు, స్టేషన్ల నిర్మాణం జరిగే ప్రాంతాలు, పిల్లర్లు, వయాడక్ట్‌ల నిర్మాణం, ట్రాక్‌ల నిర్మాణం వంటివి పరిశీలించారు. ఐటీ ఉద్యోగులను దృష్టిలో ఉంచుకొని హైటెక్‌సిటీ వరకు మెట్రోరైలును అందుబాటులోకి తేవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కారిడార్-3కి సంబంధించి నాగోల్ నుంచి రాయదుర్గం వరకు 29.5 కి.మీల మార్గంలో ఇప్పటికే నాగోల్ నుంచి అమీర్‌పేట వరకు ఆపరేషన్స్ ప్రారంభమయ్యాయి. కారిడార్-1కు సంబంధించి ఎల్బీనగర్ నుంచి మియాపూర్ వరకు 29 కి.మీల మార్గంలో ఇప్పటికే మియాపూర్ నుంచి అమీర్‌పేట వరకు పూర్తికాగా మిగిలిన మార్గాన్ని జూన్‌లోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇవి పూర్తయితే కారిడార్-3లో 30 స్టేషన్లు, కారిడార్-1లో 27 స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. కారిడార్-2కు సంబంధించి జేబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 15 కి.మీల మెట్రోమార్గంతో 16 స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి.